


నేడు సీతంపేటలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి–సీతంపేట

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)ను సోమవారం సీతంపేటలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతంపేట ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లా అధికారులు అందరూ సోమవారం సీతంపేటలో జరిగే పిజిఆర్ఎస్‌లో పాల్గొనాలని ఆయన ఆదేశించారు.



కుళాయిల ద్వారా సరఫరా చేసిన బురదనీరు

ప్రజల కనీస అవసరాల్లో తాగునీరు ప్రధానమైనది. అలాంటి తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత. అలాంటి బాధ్యతను విస్మరించడం ఏళ్లతరబడి పాలకులకు అలవాటుగా మారింది. ఆ బాధ్యతను నెరవేర్చాల్సిన అధికారులను సైతం నిర్లక్ష్యం కమ్మేసింది. చివరికి దాని పర్యావసానాన్ని ప్రజలు అనుభవించాల్సి వస్తోంది. అందుకు నిదర్శనం మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో తాగునీటి సరఫరా. మండువేసవిలోనూ బురదనీరు సరఫరా చేసి, తాగమంటున్నారంటే? ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారో ఊహించుకోవచ్చు.

- కలుషిత తాగునీరు సరఫరాతో జనం అవస్థలు
- ప్రజా సమస్యలు పట్టని పాలకపక్షాలు
- రాజకీయ విమర్శలకే ప్రాధాన్యత
- ఎమ్మెల్యే చేతిలో కీలుబొమ్మలా మున్సిపల్ కమిషనర్!

ఈ నీరు తాగమంటారా?

ప్రజాశక్తి–పార్వతీపురం

పార్వతీపురంలో వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో ఇప్పలపోలమ్మ, ఎర్రి కంచమ్మ పండగలు జరగనున్నాయి. అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. కానీ, సుమారు లక్ష మంది జనాభా కలిగిన పట్టణంలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. పట్టణ వాసులు తీవ్రమైన తాగునీటి సమస్యతో బాధపడుతున్నారు. వారంలో రెండు, మూడు సార్లు తాగునీటి సరఫరా చేయడం గగనంగా ఉంది. తోటపల్లి జలాశయం నుంచి వస్తున్న తాగునీటిని పట్టణ ప్రజలకు గత కొంతకాలంగా సరఫరా చేస్తున్నారు. పురాతన పైపులైన్ వ్యవస్థ కారణంగా పైపులైన్‌లో లీకుల వల్ల ప్రజలకు కలుషిత తాగునీరు సరఫరా అవుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పాలక పక్షాలు తాగునీటి సమస్యని పట్టించుకోవడం లేదు. రాజకీయ విమర్శలు, ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్న టిడిపి, వైసిపి నాయకులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. ప్రభుత్వం మారితే తమ సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది.

గాడితప్పిన పురపాలన

గత ఏడాది కాలంగా పురపాలన పూర్తిగా గాడి తప్పింది. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలనే ఇప్పుడూ ఎదుర్కొంటున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఉన్నారు. మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం నడుస్తోంది. యువకుడు, విద్యావంతుడైన ఎమ్మెల్యే బోనెల పట్టణ ప్రజాసమస్యలపై దృష్టి పెడతారని భావించారు. కానీ ఆయన కూడా పట్టణ సమస్యల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. కొద్ది నెలల క్రితం వైసిపికి చెందిన చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నాయకత్వంలో టిడిపి కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి తెరలేపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శోభికకు అవిశ్వాస తీర్మానం నోటీసూ అందజేశారు. కానీ నోటీసు నిబంధనల ప్రకారం సరైన ఫార్మాట్‌లో ఇవ్వలేదనే కారణంతో జిల్లా అధికారులు తిరస్కరించారు. అప్పటి నుంచి పురపాలన గతి తప్పిపోయింది. చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సిఫార్సులకు మున్సిపల్ కమిషనర్ ప్రాధాన్యత ఇవ్వడం లేదు. గత మూడు నెలలుగా మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించలేదు. దీంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి.

కమిషనర్ వైఖరిపై విమర్శలు

ఒకవైపు మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిని, మరో వైపు అధికారపార్టీ ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను సమన్వయం చేసుకుంటూ పురపాలన సాగేటట్లు పని చేయాల్సిన కమిషనర్ వెంకటేశ్వర్లు పూర్తిగా ఎమ్మెల్యే చేతిలో కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి సిఫార్సులను ఆయన బేఖాతరు చేస్తున్నారు. ఇరువురిని సమన్వయం చేసుకుంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కమిషనర్ చొరవ చూపించడం లేదు. కమిషనర్ వెంకటేశ్వర్లు అధికారపార్టీ అండతో ఏకపక్షంగా వ్యవహరించడాన్ని పుర పాలకవర్గం జీర్ణించుకోలేని స్థితిలో ఉంది. మున్సిపాలిటీలో అధికారం ఉన్నా అధికారులను నియంత్రించ లేని స్థితిలో వైసిపి పాలకవర్గం మిగిలింది.

సమస్యలపై ప్రజాసంఘాల పోరాటం

పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ప్రజాసంఘాలు కొద్ది నెలల క్రితం పోరాడాయి. ఐద్వా, పట్టణ పౌర సంక్షేమ సంఘం, సిఐటియు వంటి సంఘాల ఆధ్వర్యాన తాగునీటి సమస్యని పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది. పట్టణ వాసులకు సరిపడేంత నీరు ఇవ్వకపోవడమే కాకుండా కలుషిత నీరు సరఫరా చేయడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పండక్కీ కలుషిత తాగునీరే గతి

మరో వారం రోజుల్లో రానున్న గ్రామదేవత పండగకీ పట్టణ ప్రజలకు రక్షిత మంచినీటి సరఫరా చేసే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదు. రాజకీయ ఆధిపత్యం కోసం ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలతో కాలక్షేపం చేస్తున్న టిడిపి, వైసిపి నాయకులు తాగునీటి సమస్యని పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలకు పండుగ రోజుల్లోనూ కలుషిత తాగునీరే గతి అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే పట్టణ ప్రజలకు బురదనీరు సరఫరా అవుతోంది. ఆదివారం పట్టణంలోని 26వ వార్డులో బురదనీరు కుళాయిల ద్వారా సరఫరా కావడంతో మహిళలు ఆందోళనకు దిగారు. కలుషిత నీటి సరఫరాతో పండుగ ఎలా జరుపుకోవాలని ఆవేదన చెందుతున్నారు.



కుళాయిల ద్వారా సరఫరా చేసిన బురదనీరు

బురదనీరు సరఫరా

మహిళల ఆగ్రహం

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం పట్టణంలో పలు వార్డుల్లో ఆదివారం కుళాయిల ద్వారా బురదనీరు సరఫరా అయింది. దీంతో 26వ వార్డులో మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. బురద నీరు తాగమంటారా? పట్టణ ప్రజల ఆరోగ్యంతో ఇంకెన్నాళ్లు చెలగాట మాడతారంటూ మండిపడ్డారు. వేసవిలో బురద నీరు సరఫరా చేయడం నిలదీశారు. పట్టణంలో ఐదు రోజులకొకసారి కొళాయిల ద్వారా చాలీచాలని తాగునీరు సరఫరా చేస్తున్నారు. అది కూడా బురదనీరు సరఫరా కావడంపై ఆయా వార్డుల్లో ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి సరఫరాపై దృష్టిపెట్టాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, పాకల సన్యాసిరావు డిమాండ్ చేస్తున్నారు.



షట్టర్లను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

28న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి–పాలకొండ

తోటపల్లి ఎడమ ఆయకట్టు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 28న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు తెలిపారు. మండల పరిధిలో తోటపల్లి ఎడమ కాలువను ఆదివారం ఎపి రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయకట్టు రైతులు అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందడం లేదని, ప్రస్తుతం అవసరం లేకపోయినా నీరు వస్తుందని చెప్పారు. దీనివల్ల కొన్ని గ్రామాలకు ఉపాధి హామీ పనులు చెరువుల్లో చేసేందుకు ఆటంకంగా మారిందన్నారు. షట్టర్ మధ్యలో ఆగిపోయిందని, మరొకటి పూర్తిగా పడకపోవడం వల్ల నీరు వస్తోందని తెలిపారు. తూములు కూడా సక్రమంగా లేవని, దీనిపై అధికారులు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

28న ఉదయం 10 గంటలకు పాలకొండలోని దుర్గగుడి సెంటర్‌కు రైతులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఖండాపు ప్రసాదరావు, కడగల చిట్టిబాబు, బొత్స తవిటి నాయుడు, ఎన్.మన్మథరావు, పి.అప్పలనాయుడు, కడగల జనార్దన్ రావు, పి.శోభన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో అందరి భాగస్వామ్యం

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి–పార్వతీపురం

జిల్లా వ్యాప్తంగా జూన్ 21వ తేదీ వరకు నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుత జీవనశైలిలో ప్రతిఒక్కరూ పనిఒత్తిడిలో పడి వారి ఆరోగ్యం పట్ల సరైన దృష్టిసారించడం లేదని, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి నడుచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి భాగస్వాములను చేయాలని కోరారు. యోగాను శిక్షకుల ద్వారా వారి సమక్షంలో మాత్రమే చేయాలని, ఇందుకోసం మాస్టర్ ట్రెయినీలను సిద్ధం చేసినట్లు తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహించేలా షెడ్యూల్ ను అధికారులకు పంపించినట్లు తెలిపారు. షెడ్యూల్‌లో సూచించిన మేరకు కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.

నెల రోజుల పాటు గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో మాస్టర్ ట్రెయినీల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులతో వారి కుటుంబసభ్యులు, ప్రజా ప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు తదితరులు అందరూ పాల్గొనేలా చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

క్రీడా మైదానాల ఊసే లేదు

- అమలుకాని శిక్షణ కేంద్రాల హామీ
- 15 ఏళ్లుగా ప్రకటనలతోనే కాలక్షేపం
- నిరుత్సాహంగా గిరిజన క్రీడాకారులు



అర్థాంతరంగా నిలిచిపోయిన ఇండోర్ స్టేడియం

ప్రజాశక్తి–గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించి, క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన క్రీడా మైదానాలు ఏర్పాటు నేటికీ కార్యరూపం దాల్చలేదు. 15 ఏళ్లుగా క్రీడా మైదానాల ఏర్పాటు ప్రకటనలతోనే పాలకులు కాలక్షేపం చేస్తున్నారు. వందలాది మంది క్రీడాకారులున్నా వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో వారిలోని ప్రతిభ మన్యానికే పరిమితం అవుతోంది. ప్రతిసారి గెలిచిన ప్రజాప్రతినిధులు క్రీడా స్థలాల పరిశీలనకే పరిమితం కావడం కూడా విశేషం. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో క్రీడా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామంటూ పలుచోట్ల స్థల పరిశీలన చేసినా అది అమలు కాలేదు. దీంతో క్రీడాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులు చదువుతోపాటు వివిధ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. మన్యం నుంచి బాల బాలికలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. ఇంతటి ప్రతిభావంతులైన క్రీడాకారులున్నా ప్రోత్సాహం మాత్రం అంతంత మాత్రమే. 15 ఏళ్ల కిందట గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల్లో క్రీడా పాఠశాలలు, మైదానాలు ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదించి, ఏళ్లు గడుస్తున్నా అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. గుమ్మలక్ష్మీపురం క్రీడా మైదానం సమీపాన టిడిపి హయాంలో 2018లో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించారు. నిర్మాణ సమయంలో ఎన్నికల కోడ్ రావడం, తరువాత ప్రభుత్వం మారడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

క్రీడా శిక్షణ కేంద్రాల మాటేమిటి?

గత వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో పార్వతీపురం, సీతంపేట, తూర్పుగోదావరి, ప్రకాశం, నంద్యాల,



క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న క్రీడా అధికారులు (ఫైల్)

అనంతపురం జిల్లాల్లో ఆరు క్రీడా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ప్రకటించారు. ఇందుకోసం భద్రగిరి పిటిజి పాఠశాల ఆవరణలో క్రీడా శిక్షణ స్థల పరిశీలన కూడా చేశారు. 23 మంది కోచ్‌లను నియమించి నెలకు రూ.10 వేలు గౌరవ వేతనం కూడా ఇస్తామని ప్రకటించారు. ఇవన్నీ కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయి. ప్రభుత్వం మారాక వాటిని పూర్తిగా మరిచారు.



విలువిద్య శిక్షణలో విద్యార్థులు (ఫైల్)

క్రీడలకు జీవం పోయాలి

రోజురోజుకు కనుమరుగవుతున్న క్రీడలకు జీవం పోయాలి. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో క్రీడలకు పూర్వ వైభవం తీసుకురావాలి. ప్రతి విద్యార్థికీ క్రీడా శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– మండంగి శ్రీనివాసరావు,
సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

క్రీడలను ప్రోత్సహించాలి

ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలి. క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేసి క్రీడల్లో శిక్షణ ఇవ్వాలి. అప్పుడే విద్యార్థుల్లో ఉన్న క్రీడా ప్రతిభ వెలికి తీయడానికి వీలుంటుంది.

– పువ్వల తిరుపతిరావు,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు

మత సామరస్యానికి కృషి

ప్రజాశక్తి – సాలూరు

మత సామరస్యం, దేశ సమగ్రత కోసం సిపిఎం కృషి చేస్తుందని ఆ పార్టీ పట్టణ నాయకులు టి.ఈశ్వరరావు, శంకర్రావు, లక్ష్మి, రాముడు, జె.ఆదినారాయణ తెలిపారు.

అందులో భాగంగా ఈ నెల 30 వరకు సమైక్యత యాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో సమైక్యత యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. బిజెపి చేస్తున్న విభజన రాజకీయాలను ప్రజలంతా తిప్పుకొట్టి, దేశ సమైక్యతను కాపాడుకునేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉండాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈ ఏడాది నైరుతి ముందుగానే పలకరించింది. అందుకనుగుణంగానే ఏజెన్సీ వ్యాప్తంగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రైతులూ వేసవి దుక్కులు దున్ని, విత్తనాలు చల్లేందుకు పొలాల్ని సిద్ధం చేస్తున్నారు. అంతా బాగానే ఉన్నా... సాగునీటి దగ్గరే అసలు చిక్కొచ్చింది. వాననీటిని ఒడిసి పట్టే దిశగా చర్యలు లేకపోవడమే అందుకు కారణం. దీంతో ఈ ఏడాదీ సాగునీరు అందుతుందో? లేదో? అన్న బెంగ గిరిజన రైతుల్ని పట్టుకుంది. ఐటిడిఎ మైనర్ ఇరిగేషన్ ద్వారా చెరువులు, చెక్‌డ్యాముల నిర్మాణాలు గతంలో చేపట్టేవారు. ఖరీఫ్ ముంచుకొస్తున్నా అధికారులు ఈ ఏడాది ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడం గమనార్హం.



మరమ్మతులకు గురైన గుమ్మడ చెక్‌డ్యామ్‌ను చూపిస్తున్న పెంటయ్య

సాగునీరు అందేనా?

- ముంచుకొస్తున్న ఖరీఫ్
- ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి–సీతంపేట


సీతంపేట మండలంలో ఖరీఫ్‌కు సుమారు 5 వేల మంది సన్న, చిన్నకారు రైతులు సిద్ధమవుతున్నారు. గతేడాది వ్యవసాయ శాఖ అధికారులు 1800 కింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. వీటిలో ఆర్‌జిఎల్, సాంబమసూరి, 11:20, స్వర్ణ, 1064, 1061 విత్తనాలు కావాలని ప్రతిపాదన పెట్టారు. అధికంగా 90 శాతం ఆర్‌జిఎల్ విత్తనాలకు ప్రతిపాదించారు. ఈ ఏడాది కూడా అదే తరహాలో సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు చెరువుల్లో, చెక్‌డ్యాముల్లో చుక్కనీరు లేక పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఏజెన్సీలో గెడ్డలు, ఊటబావులు పక్కనే ఉన్న వ్యవసాయ పొలాలకు తప్ప మిగతా భూములకు వరుణుడే ఆధారం. ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ద్వారా చేపట్టిన చెరువులు, చెక్‌డ్యాములు వర్షపు నీటిని ఒడిసి పట్టి, నిల్వ చేసి, ఖరీఫ్‌కు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రస్తుతమైతే ఐటిడిఎ మైనర్ ఇరిగేషన్ ద్వారా ఆ పని చేసే పరిస్థితి కనిపించడం లేదని గిరిజన రైతులు, గిరిజన సంఘ నాయకులు ఆందోళన చెందుతున్నారు.



పిచ్చి మొక్కలతో చుక్కనీరు లేని చెరువు

సీతంపేట ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న మైనర్ ఇరిగేషన్ ద్వారా ఈ ఏడాది 11 చెక్‌డ్యాములకు మరమ్మతులు చేపట్టాలని, కొత్తవి 4 చెక్‌డ్యాములను నిర్మించాలని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటి వరకు అధికారులు ఆ పనులు ప్రారంభించ లేదు. దీంతో ఎప్పుడు ప్రతిపాదనలు తయారు చేస్తారు? ఎప్పుడు పంపిస్తారు? అవి ఎప్పుడు మంజూరు అవుతాయి? నిర్మాణాలు చేపట్టి ఎప్పుడు సాగునీరు అందిస్తారో? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



ఏజెన్సీలోని చెరువులు, చెక్ డ్యాములకు మరమ్మతులు చేపట్టి, సన్న, చిన్న కారు రైతులకు సాగునీరు అందించి, ఆదుకోవాలి. ఏజెన్సీలో ఉన్న పొలాలు వర్షాలపైనే ఆధారపడి ఉన్నాయి. కొత్తవి కూడా మంజూరు చేయాలి. దీనిపై ఐటిడిఎ అధికారులు దృష్టిసారించి పొలాలకు సాగునీరు అందించాలి.

– ఎస్‌పి పెంటయ్య, సామాజిక కార్యకర్త, జి.గుమ్మడి

15 పనులకు అంచనాలు



ఏజెన్సీలో 11 చెక్‌డ్యాములు మరమ్మతులు చేపట్టడానికి, ఓనిగెడ్డ, మల్లి గెడ్డ, కోసంగి మానుగెడ్డ, లోవగూడ గెడ్డపై కొత్తగా నాలుగు చెక్‌డ్యాములు నిర్మాణానికి అంచనాలు వేస్తున్నాం. మైనర్ ఇరిగేషన్ ద్వారా చెరువులను చూస్తున్నారు.

– ఆర్.ఆదినారాయణ, ఎస్ఎంఐ డిఇ, సీతంపేట ఐటిడిఎ

సీతంపేటలో కుండపోత

ప్రజాశక్తి–సీతంపేట

సీతంపేట మండలంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం అంతా ఎండ కాసినప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఎండలు అధికంగా ఉండటంతో గెడ్డలు, వాగుల్లో నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో కుండపోతగా కురిసిన వర్షం చాలా ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ దుక్కులకు అనుకూలంగా ఉంటుందని ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

వీరఘట్టం : మండలంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ తరుణంలో వర్షం కురవడంతో కొంతమేర ఉపశమనం కలిగింది.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి–వీరఘట్టం

గ్రామంలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని నడుకూరు గ్రామస్తులు ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ఆదివారం ఆందోళన చేపట్టారు. పలుమార్లు ఫిర్యాదు చేసిన విద్యుత్తు అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోఓల్టేజీ కారణంగా ఫ్యాన్లు, మోటార్ వంటివి పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అసలే వేసవి కారణంగా ఫ్యాన్లు పనిచేయకపోవడంతో పిల్లలు, వృద్ధులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ జి.కళాధర్ అక్కడికి చేరుకుని, గ్రామస్తులతో మాట్లాడారు. ఫోన్‌లో ఎఇ అనిల్‌కుమార్‌తో మాట్లాడి, లోఓల్టేజీ సమస్య సత్వరమే పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ట్రాన్స్ కో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నడుకూరు గ్రామస్తులు



మన్ కీ బాత్ కార్యక్రమానికి హాజరైన ఒడిశా నాయకులు, కొటియా గిరిజనులు

ఒడిశాలో కలిసిపోవాలని ఎమ్మెల్యే ఒత్తిడి

- ససేమిరా అన్న కొటియా గ్రామాల ప్రజలు
- మన్ కీ బాత్ కార్యక్రమంతో బిజెపి డ్రామా

ప్రజాశక్తి-పార్వతీపురం

వివాదాస్పద కొటియా గ్రామాల ప్రజలు ఒడిశాలో కలిసిపోవాలని, అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని కొరాపుట్ బిజెపి ఎమ్మెల్యే రఘురాం మత్స్యే కోరారు. ఆదివారం ప్రధానమంత్రి మోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా కొటియా గ్రామానికి వివాదాస్పద గ్రామాల ప్రజలను పిలిపించారు. ఈ కార్యక్రమానికి ఎగువ శెంబి గ్రామానికి చెందిన గిరిజనులు తప్ప మిగిలిన గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఒడిశాలో ఉండి పోతే అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే రఘురాం మత్స్యే కోరారు. దీనికి హాజరైన పట్టు చెన్నూరు, పగుల చెన్నూరు, దూళిభద్ర, దిగువ శెంబి గ్రామాల గిరిజనులు తిరస్కరించారు. తాము ఆంధ్రాలోనే ఉంటామని స్పష్టం చేశారు. మన్ కీ బాత్ కార్యక్రమంతో కొటియా గ్రామాల ప్రజలను మచ్చిక చేసుకోవాలనే ప్రయత్నం లో భాగంగా బిజెపి నాయకులు కొటియా గ్రామాల ప్రజలను ఆహ్వానించారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

గిరిజన సంక్షేమ శాఖ బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గత విద్యా సంవత్సరం అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యాలతో మరణించారని తెలిపారు. అలా జరగకుండా ఉండాలంటే ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఎఎన్ఎంలను నియమించాలని కోరారు.

30న జంఝావతి వద్ద జలహారతి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జంఝావతి ప్రాజెక్టు పూర్తిచేయాలని ఈ నెల 30న ఆ ప్రాజెక్టు వద్ద సామూహిక జల హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జంఝావతి సాధన సమితి తెలిపింది. ఆదివారం సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు, గౌరవ అధ్యక్షులు పారినాయుడు, కార్యాచరణ కన్వీనర్ ఎం.ఎం.కృష్ణమూర్తి నాయుడు విలేకరులతో మాట్లాడారు. సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టు పాలకుల నిర్లక్ష్యంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోందన్నారు. ఐదు దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు జంఝావతి ప్రాజెక్టును ఎన్నికల హామీగానే వాడుకుంటున్నాయని దుయ్యబట్టారు. ఎన్నికల అనంతరం జంఝావతి ఊసు పట్టడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30న చేపడుతున్న జంఝావతి జలహారతి కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దబ్బగడ్డ బిఒ సమస్య పరిష్కరిస్తా

పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని దబ్బగడ్డ బ్రాంచ్ పోస్టాఫీస్ సమస్య త్వరలో పరిష్కరిస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెదబొండపల్లి ఎస్ఒ పరిధిలో ఉన్న దబ్బగడ్డ పోస్టాఫీస్‌ను మక్కువ సబ్‌పోస్ట్ పరిధిలోకి మార్చాలని, పోస్ట్ బ్యాగు సకాలంలో చేరేలా చూడాలన్న సమస్యలు ఆయన దృష్టికి రావడంతో స్పందించారు. సకాలంలో బ్యాగ్ అందేలా వెంటనే చూస్తానని ఆయన తెలిపారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మక్కువ సబ్‌పోస్ట్ ఆఫీస్ పరిధిలోనుండి పార్వతీపురం మండలం పెదబొండపల్లి సబ్‌పోస్ట్ పరిధిలోకి గతంలో బ్రాంచ్‌ని చేర్చారని, ఈ సమస్యను కూడా మూడు నెలల్లోగా పరిష్కరిస్తామని చెప్పారు.

మహానాడును విజయవంతం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

కడపలో జరిగే మహానాడుకు తరలిరావాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. టిడిపి ముఖ్య నాయకులను కోరారు. ఆదివారం పార్వతీపురంలోని టిడిపి కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి కీలక అంశాలను మహానాడులో ప్రస్తావించే అవకాశం ఉందని, నియోజకవర్గంలోని నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నర్సిపురంలో దుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దర్శించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటరమణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : కడపలో జరిగే టిడిపి మహానాడుకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఒక ప్రకటనలో కోరారు. టిడిపి కార్యకలాపాలు, ప్రభుత్వం పనితీరు, తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు.



వీరఘట్టం పంచాయతీ కార్యాలయంపై మాజీ సిఎం ఫొటోతో ఉన్న ఫ్లెక్సీ

ఏడాదైనా తీరిక లేదా?

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టం మేజర్ పంచాయతీ కార్యాలయ భవనంపై మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటోతో బ్యానర్ దర్శనమివ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా అధికారులు తొలగించలేదు. దీంతో అధికారులకు ఇంకా తీరిక దొరకలేదా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అని విమర్శలు గుప్పిస్తున్నారు.

గ్రంథాలయానికి రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకి గ్రామంలోని నేతాజీ గ్రంథాలయ నిర్వహణకు అదే గ్రామానికి చెందిన అల్లు సత్యం రూ.10 వేల విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడుకు అందజేశారు.



నగదు అందజేస్తున్న అల్లు సత్యం

ఆర్ట్స్.. ఆదివాసీలకు దిక్సూచి

- ఉపాధి కల్పనలో తోడ్పాటు అందిస్తున్న సంస్థ
- 60 తండాల్లో ప్రకృతి వ్యవసాయం
- 300 మంది రైతులతో మిశ్రమ పంటలు

ఆర్ట్స్.. ఏజెన్సీలో ఈ సంస్థ పేరు తెలియని వారుండరు. గిరిజన ప్రాంతంలో 30 ఏళ్లుగా ఆదివాసీలకు చేదోడు వాదోడుగా ఉంటూ, అడుగడుగునా తోడుగా నిలుస్తోందీ సంస్థ. ఆర్థికంగా చేయూతనిచ్చి సంప్రదాయ వ్యవసాయానికి కట్టుబడి ముందుకు తీసుకెళ్తోంది. దీంతోపాటు విత్తనాలు, ఎరువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, ఆవుల పెంపకంతో ఆర్థికంగా ఏ విధంగా అభివృద్ధి చెందాలో మార్గనిర్దేశం చేస్తూ, అందుకు సాయం అందించి ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది.



రైతుల ద్వారా సమీకృత వ్యవసాయం చేయిస్తున్న ఆర్ట్స్ సంస్థ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో 9 పంచాయతీల పరిధిలోని 60 గ్రామాల్లో ఆర్ట్స్ సంస్థ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆదివాసీ వ్యవసాయ పద్ధతులపై 3వేల మంది రైతులతో కలిసి పని చేయించి ఆదాయం చేకూరుస్తుంది.



ఆర్ట్స్ సంస్థ సహకారంతో ఈ 60 గ్రామాల్లో గల రైతులు ఆదివాసీ వ్యవసాయ పద్ధతిలో వరి సాగును 600 మంది రైతులు సాంప్రదాయ ప్రకృతి విధానంలో సాగు చేస్తున్నారు. వరిలో సీడ్ సర్టిఫికేషన్ కోసం రైతులకు మేలైన విత్తనాలను అందించి, మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పంటను పరిశీలించి సంస్థ నుంచి సహాయం అందించి రైతులకు తోడయ్యారు. 300 మంది రైతులు అంతర, మిశ్రమ పంటలను పండిస్తున్నారు. ఆర్ట్స్ సంస్థ 'సాల్ట్' అనే ప్రత్యేక టెక్నాలజీని ఏర్పాటు చేసి కొండపోడులో 300 మంది రైతులకు పైనాపిల్, పసుపు, నిమ్మ, అల్లం, సీతాఫలం, టేకు, జీడీ మొక్కలను ఉచితంగా అందించి భావితరాలకు ఆదాయం చూపించే దిక్సూచియ్యారు. ఆర్ట్స్ సంస్థ నుంచి 50 మందికి పౌల్ట్రీ రైతులకు, ఒక్కొక్కరికి 10 కోళ్లు చొప్పున 50 మందికి 500 కోళ్లు పంపిణీ చేశారు. వీటి నుండి కొత్త కోళ్లను ఉత్పత్తి చేసి అదనపు ఆదాయ వనరుగా కల్పించారు.

ఆర్ట్స్ సంస్థ నుంచి 500 మంది మహిళా రైతులకు న్యూట్రీగార్డెన్‌ను ఏర్పాటు చేయించి కూరగాయ మొక్కలను పెంపకం. దమ ద్వారా ఇంటికి అవసరమైన కూరగాయలు కొనే అవసరం లేకుండా, ఇంటి అవసరానికి మించి ఉన్న కూరగాయలను మార్కెట్లో అమ్ముకుని చిన్న ఆదాయ వనరుగా కల్పించడమే ప్రధాన లక్ష్యం ముందుకు సాగారు. ఆసక్తి కలిగిన 30 మంది రైతులకు, ఒక్కొక్కరికి 2 మేకలు చొప్పున మొత్తం 60 మేకలను అందజేసి. వీటి నుంచి కొత్తతరం పిల్లలను ఉత్పత్తి చేసి వాటి నుంచి అదనపు ఆదాయ వనరుగా కల్పించడమే ప్రధాన ధ్యేయమనిచెప్పవచ్చు. ఆర్ట్స్ సంస్థ నుంచి ఆదివాసీ వ్యవసాయ పద్ధతుల సాగులో భాగంగా, ప్రకృతి వ్యవసాయానికి అవసరమగు ఆవు మూత్రం, పేడలను సేకరించేందుకు, పశువులు ఉన్న 36 మంది రైతులకు పశు శాలలు ఏర్పాటు చేశారు. వీటికి అవసరమైన పశువులు శాల పైకప్పు, ఫ్లోర్, సిమెంట్, ఇసుక, రాయి, కూలీలకు కూలీ డబ్బులు ఆర్ట్స్ సంస్థ నుంచి ఇచ్చారు.

ఆర్ట్స్ సంస్థ నుంచి చేపల పెంపకాన్ని ప్రోత్సహించి, ఊరులో ఉన్న 30 చెరువుల్లో 300 మంది రైతులకు శిక్షణ ఇచ్చి, చేప పిల్లలు కూడా ఇచ్చి చేప పిల్లల పెంపకాన్ని ప్రోత్సహించారు. దీని ద్వారా అదనపు ఆదాయం చేకూర్చేలా కృషి చేశారు. ఆర్ట్స్ సంస్థ నుంచి ఆదివాసీ వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో గుళి రాగిని పండించారు. గుళి పద్ధతిలో పండించడం వల్ల దిగుబడి పెరిగింది. దీని ద్వారా ఆదాయం పెరిగి రైతులకు ఆర్థికంగా నిలదొక్కోవడానికి ఇది ఒక మంచి అవకాశం.

రూ.లక్షా 20 వేలు ఆదాయం



ప్రకృతి, సమీకృత వ్యవసాయం ద్వారా కోళ్లు, మేకల పెంపకం చేయడం తద్వారా జీడి యాజమాన్య పద్ధతులు చేయడం వల్ల తనతో పాటు అక్కడున్న రైతులతో చేయిస్తున్నాం. ఈ పంటల ద్వారా ఏడాది రూ.80వేల నుంచి రూ.లక్షా20వేల వరకు ఆదాయం వస్తుంది.

- పెంటయ్య, కుసిమిగూడ, గిరిజనుడు

భవిష్యత్తు తరాలకు ఉపయోగం



ప్రకృతి వ్యవసాయం చేయడం ఘన, ద్రావణ జీవం పిచికారీ చేయడం ఆర్ట్స్ సంస్థ రైతులకు అవగాహన కల్పించడం నేచురల్ ఫామ్ ఏర్పాటు చేయడంతో భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుంది. మాకు సహకారం అందించిన ఆర్ట్ సంస్థకు కృతజ్ఞతలు.

- సింహాచలం, చిడిమానుగూడ

ఆదాయం పెంచడమే లక్ష్యం



గిరిజన ప్రాంతంలో ఉన్న ఆదివాసీలకు ఆదాయం పెంచి అభివృద్ధి చెందేలా ఆర్ట్స్ పనిచేస్తుంది. కొన్ని ప్రాజెక్టుల ద్వారా రైతులకు శిక్షణ ఇస్తాం. సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా సమీకృత వ్యవసాయం ద్వారా ఆదాయం పెంపుదల చేసి నేల పరిపుష్టి భూసారం పెంచి భవిష్యత్తు తరాలకు కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నాం. దీనికి సహకరించిన ఐటిడిఎ అధికారులకు హార్టికల్చం, వ్యవసాయశాఖ అధికారులతో ముందుకు వెళ్తున్నాం.

- నూక సన్యాసిరావు, డైరెక్టర్ , ఆర్ట్స్ సంస్థ

హత్యా? ఆత్మహత్యా?

- హత్యేనంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన మృతుడి తండ్రి
- సమాధి నుంచి మృతదేహాన్ని బయటకు తీసి విచారణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడలో ఆదివారం బొడ్డు భూలోక (36) ఇంట్లో ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. బంధువులు కుటుంబీకులు శ్మశానంలో ఖననం చేశారు. అనంతరం ఎవరింటికి వారు వెళ్ళిపోయారు. మృతుని తండ్రి అప్పన్న మాత్రం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి బడి సూరిబాబు, బొడ్డు అశోక్, బొడ్డు చిన్న భూలోక, బొడ్డు అప్పలస్వామి నా కొడుకుని హత్య చేసి కననం చేశారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. వెంటనే భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణతోపాటు పూసపాటిరేగ ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని ఫిర్యాదులో పేర్కొన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఖననం చేసిన మృతదేహాన్ని బయటికి తీయించి విచారణ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు.

గ్రామస్తులందించిన వివరాలు ప్రకారం మృతుడు భూలోకకు, ఫిర్యాదులో పేర్కొన్న నలుగురూ బంధువులు. వీరి మధ్య శనివారం రాత్రి స్వల్ప వివాదం జరిగింది. ఈ క్రమంలో మృతునికి నిందుతులుగా గుర్తించిన నలుగురి మధ్య కొట్లాట జరిగింది. ఇందులో భాగంగా మృతుడు భూలోక సూరిబాబును తలపై కొట్టడంతో ఆయనకు గాయమైంది. దీంతో సూరిబాబు భోగాపురం సిహెచ్‌సిలో వైద్యం చేయించుకున్నాడు. అనంతరం శనివారం రాత్రి 11 గంటల సమయంలో మృతుడు తండ్రి అప్పన్న, మృతుని తమ్ముడు రాము, మృతుడు భూలోక కలిసి మద్యం సేవించి పడుకున్నారు. తెల్లవారు జామున చూసేసరికి భూలోక తన ఇంట్లో ఉరేసుకొని ఉన్నాడు. మృతదేహాన్ని కిందకు దించి గుట్టుచప్పుడు కాకుండా కుటుంబీకులతో పాటు ఆ నలుగురు నిందితులు బంధువులు కలిసి శ్మశాన వాటికలో భూలోక మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే మృతుడు తండ్రి అప్పన్న మాత్రం ఆ నలుగురే తన కుమారుడుని చంపేశారంటూ రోదిస్తున్నాడు. హత్య, ఆత్మహత్య అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడు మద్యం మత్తులో పలుమార్లు ఉరేసుకోవడానికి ప్రయత్నం చేసినట్లు బంధువులు చెప్తున్నారు. శనివారం రాత్రి కూడా మద్యం మత్తులో ఉరేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే కుటుంబీకులతో పాటు గ్రామస్థులకు ఇది హత్యేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విచారణ అనంతరం హత్య ఆత్మహత్య అన్నది తేలాల్సి ఉంది.



భూలోక మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలిస్తున్న పోలీసులు

అనాథలైన పిల్లలు



అనాథలైన పిల్లలు

మృతుడు భూలోకకు ఇద్దరు కుమార్తెలు హర్షిని, రజినితో పాటు కుమారుడు అక్షయ వర్ధన్ ఉన్నాడు. భార్య రెండేళ్ల క్రితం ప్రమాదంలో మృతి చెందింది. తల్లితో పాటు తండ్రిని కూడా కోల్పోయి పిల్లలు అనాధలుగా మిగిలిపోవడంతో కన్నీటి పర్యంత మవుతున్నారు.

పేలుళ్ల కోసం ఐదుచోట్ల రెక్కీ

ఐదేళ్లకు పైగా ఉగ్రవాద కార్యకలాపాలపై శిక్షణ ?

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉగ్ర లింకుల వ్యవహారంలో అరెస్ట్ పోలీసుల కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్‌లు విజయనగరం, హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు, ముంబాయిలో పేలుళ్ల కోసం రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. పోలీసు శిక్షణ కళాశాలలో మూడో రోజు సిరాజ్, సమీర్ లను కౌంటర్ ఇంటెలిజెన్సు, యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, ఎన్ఐఎ టీములు విచారించాయి. వీరిద్దరూ సుమారు ఐదేళ్లుగా ఉగ్రవాద భావాలపై శిక్షణ పొందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సిరాజ్ పూర్తిగా ఆ భావజాలంపై ఆకర్షితులు ఆయినట్లు తెలుస్తోంది. ఉగ్రవాద సంస్థలు ఇచ్చిన శిక్షణ తో సురాజ్, సమీర్ దేనికైనా సిద్ధపడినట్లు సమాచారం. ఇప్పటికే పలు ఉగ్రవాద పెద్దలను కలిసిన సిరాజ్, సమీర్‌లు ఆ పెద్దలతో మాట్లాడిన విషయాల పై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. అయితే ఆ విషయాలు చెప్పేందుకు సిరాజ్ నిరాకరించినట్లు తెలిసింది. సౌదీ హేండర్ల నుంచి అందినట్లు భావిస్తున్న నిధులపై కూడా కూపీ లాగినట్లు తెలిసింది.



యోగా శిక్షణకు హాజరైన ఎన్‌సిడి డిపిఒ జగన్‌మోహనరావు

జిల్లా స్థాయిలో యోగా శిక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురం

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మాస్టర్ ట్రెయినీలకు యోగాపై రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణ నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన శిక్షణలో ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి యోగా గురు రాహుల్ సింగ్ చౌహాన్ వర్చువల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం జగన్మోహన్ మాట్లాడుతూ మండల స్థాయి ట్రెయినీలకు యోగా మార్గదర్శకాలు పాటిస్తూ నైపుణ్యంతో కూడిన శిక్షణ అందజేయాలని మాస్టర్ ట్రెయినీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ బి.సుశీల, ఎంపిడిఒ జి.రమేష్, యోగా గురు మోహన్ గంత్యాట్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ఎం.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వయ్యారి భామా.. జాగ్రత్త సుమా!

ప్రజాశక్తి-మక్కువ

ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ఓ కలుపు మొక్క వయ్యారి భామ. ఇది గ్రామాల్లో ఏపుగా పెరిగి విరబూస్తోంది. ఈ మొక్క ఆస్తమా వ్యాధిగ్రస్తులకు అత్యంత ప్రమాదకారిణి. ఇతర అలర్జీవ్యాధులు కూడా వ్యాప్తి చెందడంలో దీని పాత్ర ఎక్కువగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అప్పటి కలెక్టర్ హరిజవహర్‌లాల్ ఈ మొక్కపై గతంలో జిల్లాలో యుద్ధాన్ని ప్రకటించారు.

బెంబేలెత్తుతున్న ప్రజలు

ఎక్కడా ఈ మొక్క ఆనవాళ్లు ఉండకూడదంటూ పంచాయతీ స్థాయిలో ఆదేశాలు జారీ చేసి, పీకి పడేశారు. కొన్నేళ్ల తర్వాత మళ్లీ గ్రామాల్లో వయ్యారిభామ మొక్కలు ఎక్కడికక్కడ పెరుగుతుండటంతో ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే తొలగించాలని కోరుతున్నారు.



గ్రామాల్లో ఏపుగా పెరిగిన వయ్యారిభామ మొక్కలు



టైర్లు మారుస్తున్న మెకానిక్

మున్సిపల్ వాహనాలకు రూ.5 లక్షలతో టైర్లు మార్పు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

రూ.5 లక్షలతో మున్సిపల్ వాహనాలకు టైర్లు మారుస్తున్నారు. మున్సిపాలిటీలో 3 చెత్త సేకరణ ట్రాక్టర్లు, 2 వాటర్ ట్యాంకర్లు, 2 హైడ్రాలిక్ కాంపేక్టర్లు, ఒక టిప్పర్ టైర్లు అరిగిపోయాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురవుతున్నట్లు ఆయా వాహనాల సిబ్బంది.. కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రూ.5 లక్షలు కేటాయించడంతో వాహనాలకు అరిగిపోయిన టైర్లను దశల వారీగా మారుస్తున్నారు.

ప్రజా చైతన్యమే జెవివి లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనేక రకాల సామాజిక రుగ్మతల నుండి ప్రజలను బయటకు తీసుకువచ్చి,వారిని చైతన్య పరిచే దిశగా జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ డివిజి శంకర్రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో పనిచేసే జనవిజ్ఞాన వేదిక వంటి సంస్థలు ఈ దేశానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. శాస్త్ర,సాంకేతిక విజ్ఞాన ఫలాలు ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రజలను శాస్త్ర విజ్ఞాన వైపు ప్రయాణించే దిశగా కషి కృషి చేయడం అభినందనీయమన్నారు. వ్యవసాయ శాఖ డిడి అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రజల్లో నెలకొన్న మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా జెవివి పనిచేయడం అభినందనీయమని తెలిపారు. జెవివి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి మాట్లాడుతూ 30 ఏళ్ల జనవిజ్ఞాన వేదిక ప్రస్థానంలో ఎన్నో సైన్స్ ఉద్యమాలను చేపట్టి విజయాలను సాధించిందని అన్నారు. అక్షరాస్యత,సారా వ్యతిరేక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించామని తెలిపారు. సామాజిక కార్యకర్తలు బొడ్డేపల్లి రామకృష్ణారావు, మమ్ముల తిరుపతిరావులను ఈ సందర్భంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యు.శాంతికుమారి పాల్గొన్నారు.

'ఆత్మగౌరవం'.. అసాంఘిక శక్తులకు నిలయం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని రాయగడ రోడ్డులో మహిళల ఆత్మగౌరవం కాపాడటం కోసం కొన్నేళ్ల క్రితం సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. ఏళ్లు గడుస్తున్నా వాడుకలోకి తీసుకురాక పోవడంతో మూలకు చేరాయి. ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. వెంటనే ఈ భవనానికి మరమ్మతులు చేపట్టి, మౌలిక సదుపాయాలు కల్పించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న సామాజిక మరుగుదొడ్లు